క్లుప్తంగా

దివ్యాంగుల భవన నిర్మాణానికి నిధులు



దివ్యాంగులకు ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: దివ్యాంగుల భవన నిర్మాణానికి గుంతకల్లు మండల పరిషత్ కార్యాలయం నుంచి రూ.5 లక్షలు అందజేస్తున్నట్లు ఎంపీడీవో శ్రీకాంత్ చౌదరి, ఎంపీపీ బీవీ మాధవి తెలిపారు. చైతన్య విభిన్న ప్రతిభావంతుల మండల సమాఖ్య కార్యాలయ భవన నిర్మాణానికి గుంతకల్లు పట్టణంలోని దోనిముక్కల ఏరియాలో 5 సెంట్ల స్థలాన్ని కేటాయించిన నేపథ్యంలో దివ్యాంగులు భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. భవన నిర్మాణానికి సహాయ సహకారాలను కోరుతూ దాతలు, అధికారులు, ప్రభుత్వ సంస్థలను సంప్రదిస్తున్నారు. ఈ క్రమంలో గుంతకల్లు మండల పరిషత్ నుంచి దివ్యాంగుల భవన నిర్మాణానికి రూ.5 లక్షలను కేటాయిస్తూ ఎంపీడీఓ వారికి ప్రొసీడింగ్ కాపీని అందజేశారు.

దరఖాస్తు చేసుకుంటేనే 'వ్యవసాయేతర' అనుమతి



భూమిని పరిశీలిస్తున్న గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు

యాడికి: పొలాన్ని వ్యవసాయేతర భూమిగా మార్చుకోవాలంటే సంబంధిత రైతు కచ్చితంగా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాలని లేకుంటే అనుమతులు మంజూరు చేయబోమని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని రాయలచెరువు గ్రామానికి చెందిన రైతు శివకు గ్రామ సమీపంలో 1475, 1480 ఎల్పీఎం నంబరులో వ్యవసాయ భూమి ఉంది. వ్యవసాయేతర భూమిగా మార్చాలని రెవెన్యూ అధికారులకు రైతు దరఖాస్తు చేసుకున్నాడు. గురువారం తహసీల్దార్ ప్రతాప్ రెడ్డితో కలసి ఆర్డీఓ ఆ పొలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్ఓ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువతి మృతి



రాజేశ్వరి (ఫైల్)

పెద్దవడుగూరు: మండలంలోని చిత్రచేడు గ్రామానికి చెందిన రాజేశ్వరి(19) అనే యువతి చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు.. గత సోమవారం ఇంట్లో అక్క, బావ గొడవ పడుతుండటంతో రాజేశ్వరి సర్దిచెప్పడానికి ప్రయత్నించింది. దీనిపై వారు అసహనం వ్యక్తం చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురై మరుగుదొడ్డిలోకి వెళ్లి పురుగుల మందు తాగింది. నొప్పి తట్టుకోలేక గట్టిగా అరవడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్యం నిలకడగా ఉందని భావించిన వైద్యులు బుధవారం డిశ్చార్జ్ చేశారు. ఇంటికి వచ్చిన అనంతరం రాత్రి 11 గంటల ప్రాంతంలో పరిస్థితి విషమంగా మారడంతో కుటుంబ సభ్యులు ఆమెను అనంతపురానికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వ్యక్తి మృతి



కుళ్లాయి స్వామి (ఫైల్)

గుత్తి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు.. పట్టణంలోని పరమేశ్వరయ్య పెట్రోల్ బంక్ వద్ద గత మంగళవారం రోడు దాటుతున్న కుళ్లాయిస్వామి అనే వ్యక్తిని ఆటో ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. స్థానికులు అతడిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అతడిని అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కుళ్లాయి స్వామి మృతి చెందినట్లు ఏఎస్ఐ నాగమాణిక్యం చెప్పారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రేషన్ దుకాణాల తనిఖీ



రేషన్ షాపును పరిశీలిస్తున్న తహసీల్దార్ శేషారెడ్డి

పుట్లూరు: మండలంలోని పుట్లూరు, బాలాపురం, చింతలపల్లి తదితర గ్రామాల్లోని రేషన్ షాపులను గురువారం తహసీల్దార్ శేషారెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా రేషన్‌షాపుల్లో సరుకుల నిల్వలపై ఆరా తీశారు. నిర్ణీత సమయాల్లో రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు సరుకులను అందించాలన్నారు. ఆయన వెంట వీఆర్ఓలు వెంకటనారాయణ, నరేంద్ర ఉన్నారు.



తాడిపత్రిలో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు



గుత్తిలో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

ప్రయాణికులకు మహా కష్టాలు

- మహానాడుకు ఆర్టీసీ బస్సుల తరలింపు
- ఇబ్బందులు పడ్డ మూడు జిల్లాల ప్రయాణికులు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయని అధికారులు

తాడిపత్రి రూరల్/గుత్తి: టీడీపీ మహానాడు కార్యక్రమం జిల్లాలోని ప్రయాణికులకు కష్టాలు తెచ్చిపెట్టింది. మూడు రోజుల పాటు అరకొర బస్సులతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పార్టీ కార్యక్రమాలకు ఆర్టీసీ బస్సులను ఉపయోగించబోనని గత ఎన్నికల సమయంలో డబ్బా కొట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు మహానాడుకు పెద్ద ఎత్తున ఆర్టీసీ బస్సులను ఉపయోగించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. బస్సులు లేక రోగులు, వృద్ధులు, మహిళలు తీవ్ర అవస్థలు పడ్డారు. అరకొర బస్సులు జనం రద్దీతో కిక్కిరిసిపోయాయి. సీటు దొరకకపోవడంతో వృద్ధులు, రోగులు నిలబడి ప్రయాణం చేయాల్సిన పరిస్థితిని మహానాడు కార్యక్రమం కల్పించింది.

మూడు జిల్లాల ప్రయాణికులకు అవస్థలు

తాడిపత్రి డిపోనకు చెందిన పలు ఆర్టీసీ బస్సులను అధికారులు కడపలో జరుగుతున్న మహానాడుకు పంపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పొదుపు సంఘాల మహిళలను తరలించడానికి బస్సులను ఉపయోగించారు. తాడిపత్రి ఆర్టీసీ డిపోనకు అనంతపురం, కడప, కర్నూలు. నంద్యాల జిల్లాలు సరిహద్దుగా ఉన్నాయి. ఆయా జిల్లాల నుంచి కూడా తాడిపత్రికి బస్సులు వస్తుంటాయి. మూడు రోజులుగా ఇక్కడి బస్సులతో పాటు అక్కడి బస్సులు కూడా తాడిపత్రికి సక్రమంగా రాలేదు. తాడిపత్రి– అనంతపురానికి ప్రతి అర గంటకు బస్సు సర్వీసు ఉండగా గంటపాటు నిరీక్షించినా బస్సు రాలేదని ప్రయాణికులు వాపోయారు. తాడిపత్రి–ధర్మవరానికి రెండు గంటల పాటు వేచి ఉన్నా బస్సు రాకపోవడంతో పలువురు ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కడప జిల్లా కేంద్రానికి అనంతపురంతో పాటు తాడిపత్రి, కళ్యాణదుర్గం నుంచి ఉన్న ప్రత్యేక సర్వీసులు సైతం సక్రమంగా నడపలేదు. తాడిపత్రికి సరిహద్దుగా ఉన్న జిల్లాల్లోని గ్రామాలకు చెందిన ప్రజలకు స్వగ్రామాలకు వెళ్లడానికి ఏకైక మార్గం ఆర్టీసీ సర్వీసులే కావడంతో గంటల తరబడి వేచి ఉండకతప్పలేదు. మూడు రోజులుగా పలు ప్రాంతాలకు బస్సు సర్వీసులు అరకొరగా ఉండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో రైళ్లను ఆశ్రయించాల్సి వచ్చింది. అలాగే గుత్తి డిపోలో పలు బస్సులను అధికారులను కడప లో జరుగుతున్న మహానాడుకు తరలించడంతో ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. దీంతో వృద్ధులు, పిల్లలు, మహిళలు అవస్థలు పడ్డారు. ప్రయాణికులు మాట్లాడుతూ గంటల తరబడి వేచి ఉన్నా బస్సులు రావడం లేదన్నారు. బస్సులన్నీ తెలుగుదేశం మహానాడుకు పంపారంట.. ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన ప్రతి సారీ ఇలాంటి పరిస్థితులే దాపురిస్తాయని ప్రయాణికులు నిట్టూర్చారు. కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయకపోవడంపై అధికారులపై మండిపడ్డారు.

రెండు గంటలు వేచి ఉన్నాం..

తాడిపత్రి నుంచి ధర్మవరానికి బంధువులను పంపడానికి బస్సు కోసం రెండు గంటల నుంచి వేచి ఉన్నాం. బస్సు లేక పోవడంతో మాతోపాటు వృద్ధులు, చిన్నారులు, మహిళలు ఇబ్బందులు పడ్డారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలయయ్యారు.



– రామాంజనేయులు, తాడిపత్రి

తిమ్మంపల్లి బస్సు రాలేదు

తాడిపత్రి నుంచి యల్లనూరు మండలం తిమ్మంపల్లికి వెళ్లడానికి గంటకు పైగా బస్టాండ్‌లో బస్సు కోసం ఎదురు చూసినా రాలేదు. ఎంక్వైరీలో కూడా బస్సు ఏ సమయంలో వస్తుందో చెప్పలేకపోతున్నారు. బస్సులన్నింటినీ మహానాడుకు పంపి ప్రయాణికులను ఇబ్బంది పెట్టారు.



– వెంకట్రామిరెడ్డి, దిమ్మగుడి

59 బస్సులను పంపాం

తాడిపత్రి ఆర్టీసీలో మొత్తం 118 బస్సులకు గాను 59 బస్సులను కడపలో జరుగుతున్న మహానాడుకు పంపాం. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా బస్సు సర్వీసులను నడిపాం. సకాలంలో బస్సులు నడిచే విధంగా సిబ్బందిని అలర్ట్ చేశాం.

– నందిని, ఇన్‌చార్జ్ డీఎం, తాడిపత్రి

బూటకపు ఎన్‌కౌంటర్లను ఆపాలి



మాట్లాడుతున్న ఓపీడీఆర్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి రామ్‌కుమార్

గుంతకల్లుటౌన్: ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసీలపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేయిస్తున్న బూటకపు ఎన్‌కౌంటర్‌లను వెంటనే నిలిపివేయాలని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సమితి(ఓపీడీఆర్) రాష్ట్ర కమిటీ కార్యదర్శి ఆర్.రామ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం మెయిన్ రోడ్డులోని పాత్రికేయుల భవన్‌లో ఓపీడీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు లాయర్ నాగరాజు అధ్యక్షతన దేశంలో జరుగుతున్న హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా సమావేశం నిర్వహించారు. రామ్‌కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాలరాసే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ప్రజా హక్కుల కోసం పోరాడేవారిని కుట్రదారులని, మావోయిస్టు పార్టీ సానుభూతిపరులనే ముద్ర వేసి అమాయకులైన గిరిజనులను బూటకపు ఎన్‌కౌంటర్‌ల పేరిట హత్య చేయించడం రాజ్యాంగ ఉల్లంఘనేనని ఆయన మండిపడ్డారు. మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్పగించకుండా తగలబెట్టడం చూస్తుంటే రాజరిక, నియంతలాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయంటూ నిప్పులు చెరిగారు. బూటకపు ఎన్‌కౌంటర్‌లపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి కారకులైన వారిని శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జయరామ్, జాయింట్ సెక్రటరీ తిమ్మయ్య, సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి సురేష్, రఘునాథరెడ్డి, ప్రజాసంఘాల నాయకులు, మేధావులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ప్రతిష్టాపనోత్సవాలు



పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి, భార్య రమాదేవి

యల్లనూరు: మండలంలోని తిమ్మంపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో లక్ష్మీ వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా గురువారం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు ప్రారంభమయ్యాయి. ఉదయం గోపూజ, గణపతి పూజ, దేవతా నాంది, యాగశాల ప్రవేశం, కలశ స్థాపన, విష్ణు సహస్ర నామ పారాయణం, ప్రత్యేక పూజల్లో తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, భార్య రమాదేవి, కుమారులు హర్షవర్ధన్‌రెడ్డి (ఆలయ కమిటీ చైర్మన్), సాయి ప్రతాప్‌రెడ్డి పాల్గొని స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. ఉదయం ముగ్గుల పోటీలను నిర్వహించి, ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అలాగే క్రికెట్ పోటీలో ప్రతిభ చూపిన బుక్కాపురం జట్టుకు ప్రథమ బహుమతి కింద ఆలయ కమిటీ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి రూ.50 వేలు, చింతకాయమంద జట్టుకు రెండో బహుమతి కింద రూ.25 వేలను సాయి ప్రతాప్‌రెడ్డి అందజేశారు.

నేడు గ్రామోత్సవం

తిమ్మంపల్లిలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్ర వరకూ వేద పండితులు లక్ష్మీనారాయణ ప్రసాదు శర్మ, అర్చకులు శేషగిరి శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు మూల విరాట్ గ్రామోత్సవం నిర్వహిస్తారు. 31వ తేదీ స్వామి విగ్రహ ప్రతిష్ట, హోమ కార్యక్రమాలతో పాటు రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. రాత్రి జబర్దస్త్ టీంతో కార్యక్రమాలు, మెగా మ్యూషికల్ నైట్ షో కార్యక్రమాలు చేపట్టనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

శింగనమలకు 1,500 క్వింటాళ్లు



పెరవళి రైతు సేవ కేంద్రానికి వచ్చిన విత్తన వేరుశనగ

శింగనమల: మండలానికి విత్తన వేరుశనగ కాయలు 1,500 క్వింటాళ్లు కేటాయించారని ఏఓ అన్వేష్ కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని పెరవళి, వెస్ట్ నరసాపురం, రాచేపల్లి, ఆకులేడు, సోదనపల్లి, శింగనమల, సలకంచెరువు రైతు సేవ కేంద్రాలకు విత్తన కాయలు సరఫరా చేశారు. మండలంకు కే6 –1,400 క్వింటాళ్లు, టీసీజీఎస్1694 – 100 క్వింటాళ్లు కేటాయించారన్నారు. ఇప్పటికే 701 క్వింటాళ్లు మండలంకు వచ్చాయన్నారు. శుక్రవారం నుంచి రైతు సేవ కేంద్రంలో విత్తన నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు.

ఆర్థిక సాయం అందజేత

శింగనమల: మండలంలోని గురుగుంట్ల గ్రామానికి చెందిన నాగార్జున మూడు రోజుల క్రితం సోమలదొడ్డి వద్ద ప్రమాదానికి గురై కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి వెంకటరమణ అక్కడికి వెళ్లి పరామర్శించారు. వైద్యం కోసం రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు ఓబులపతి, ఆదినారాయణ, హరి, రామాంజనేయులు, పవన్, ఆంజనేయులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ భూముల పరిశీలన



యాడికిలో సీఐడీ అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రతాపరెడ్డి

పుట్లూరు: మండలంలోని చెర్లోపల్లి సమీపంలో ఉన్న అగ్రిగోల్డ్ భూములను గురువారం సీఐడీ అధికారులు పరిశీలించారు. సర్వే నంబర్ల వారీగా స్థానిక రెవెన్యూ అధికారులు, సర్వేయర్లతో కలసి భూముల వివరాలపై ఆరా తీశారు. సీజ్ చేసిన భూములు, అగ్రిగోల్డ్ గొడాములను పరిశీలించారు.

యాడికి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ ప్రతాపరెడ్డి, రెవెన్యూ సిబ్బందితో సీఐడీ అధికారులు సమావేశమై మాట్లాడారు. మండలంలోని నిట్టూరు గ్రామ సమీపంలో ఉన్న 63 ఎకరాల అగ్రిగోల్డ్ భూమిపై ఆరా తీశారు. అంతకు ముందు సీఐడీ అధికారులతో కలసి నిట్టూరులోని అగ్రిగోల్డ్ భూములను తహసీల్దార్ పరిశీలించారు.

ఆకట్టుకున్న పౌరాణిక నాటక ప్రదర్శన



పంచరత్నాలు పౌరాణిక నాటక ప్రదర్శన దృశ్యం

పామిడి: పట్టణంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణంలో తెలుగుభాష సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో స్వరరాగ నాటక కళాసమితి సౌజన్యంతో బుధవారం రాత్రంతా నిర్వహించిన పంచరత్నాలు పౌరాణిక నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. స్వరరాగ నాటక కళాసమితి సభ్యులు పుంజా కృష్ణారావుయాదవ్, దేవరాజు, రమణమూర్తి, ఆంథోని, హనుమంతరెడ్డి, వనజకుమారి, నాగవేణి తమ నటనతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా వారిని గ్రామపెద్దలు సత్కరించారు.

బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను పరిశీలిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

గుంతకల్లు: డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆదేశాల మేరకు అనంతపురం, కర్నూలు జిల్లాల ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రత్యేక బృందాలు గురువారం జిల్లా సరిహద్దు ప్రాంతాల్లోని నాటు సారా తయారీ స్థావరాల్లో తనిఖీలు చేపట్టాయి. గుంతకల్లు, గుత్తి, కర్నూలు జిల్లా పత్తికొండ ఎక్సైజ్ పోలీసులు బృందాలుగా విడిపోయి చేపట్టిన తనిఖీల్లో సుమారు 4వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 100 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సీఐ శివసాగర్ తెలిపారు. తనిఖీల్లో ఏఈఎస్ శ్రీరామ్, సీఐ అన్నపూర్ణ (అనంతపురం), డీటీఎఫ్ సీఐ జయంత్‌రెడ్డి, గుత్తి ఎక్సైజ్ సీఐ ఉమాదేవి, విశ్వేశ్వరరావు (పత్తికొండ), ఏఈఎస్‌లు రాజశేఖర్‌గౌడ్, డీటీఎఫ్ ఏఈఎస్ రామకృష్ణారెడ్డి, ఎస్ఐలు సుశీలమ్మ (గుంతకల్లు), ప్రవీణ్ (పత్తికొండ) తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవం విజయవంతం చేయండి



మాట్లాడుతున్న కమిషనర్ బబ్బార్‌మియా



ఎంపీడీఓ కార్యాలయంలో యోగా ఆసనాలు వేయిస్తున్న శిక్షకుడు

గుత్తి రూరల్: గుత్తి పట్టణంలోని పురాతన కోటలో జూన్ 2న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ హాజరవుతారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్డీఓ శ్రీనివాస్, డీఎల్‌డీఓ విజయలక్ష్మి, జిల్లా టూరిజం అధికారి జయకుమార్ బాబు, కమిషనర్ బబ్బార్‌మియా సూచించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం యోగా దినోత్సవానికి సంబంధించిన ఏర్పాట్ల గురించి సమీక్ష, సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గుత్తి కోటపైకి యోగా కార్యక్రమానికి వచ్చే వారు తప్పకుండా బూట్లు ధరించి రావాలన్నారు. కోటపై తాగునీరు, అల్పాహారం ఏర్పాటు చేస్తామన్నారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, అన్ని శాఖ ఉద్యోగులు 2న ఉదయం 6 గంటల్లోపు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఓబిలేసు, ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఏపీఓ రమేష్, ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

గుత్తి రూరల్: రోజూ యోగా ఆచరించడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, యోగా శిక్షకుడు రామకృష్ణ సూచించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్రపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా యోగా శిక్షకులు కార్యాలయ ఉద్యోగులు, ప్రజలతో యోగా ఆసనాలను వేయించారు. కార్యక్రమంలో ఏపీఓ రమేష్, సచివాలయ ఉద్యోగులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌కార్డున్న వారికి పనులు చూపండి

గుత్తి రూరల్: ఉపాధి హామీ జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి పనులు చూపాలని ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ సూచించారు. మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జాబ్ కార్డులో పేర్లు ఉన్న వారు మాత్రమే పనులు చేయాలన్నారు. జాబ్ కార్డులో లేనివారు పనులు చేసేటప్పుడు ఏవైనా ప్రమాదాలు జరిగితే ప్రభుత్వం నుంచి ఎలాంటి పథకాలు అందవన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కూలీల హాజరు, మస్టర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ రమేష్, కూలీలు పాల్గొన్నారు.



కొత్తపేటలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రభాకర్

టౌన్ కన్వీనర్‌కు పరామర్శ

పామిడి: పట్టణంలోని పామిడిమ్మ వీధిలో నివాసమున్న వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ నాగూరు ఈశ్వర్‌రెడ్డిని గురువారం పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈశ్వర్‌రెడ్డి గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను ఇంటికి వెళ్లి పరామర్శించారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బోయ మండ్ల సుధాకర్, నాయకులు, మురళీమోహన్‌రెడ్డి, మెకానిక్ రామాంజనేయులు, మురళి, సూర్యనారాయణ, దస్తగిరి, సూరి, సుధాకర్. వెంకటరాముడు పాల్గొన్నారు.

2న తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



మాట్లాడుతున్న చింతా పురుషోత్తం

పెద్దపప్పూరు: కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా సూపర్ సిక్స్ అమలు చేయకపోవడంతో జూన్ 2న మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ మండల కార్యదర్శి తెలిపారు. ఇల్లులేని నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించాలన్నారు. ఎన్నికల హామీలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడానికి ధర్నా చేపడతామన్నారు.

ఆర్డీటీకి విరాళం అందజేత



ఆర్డీటీ సిబ్బందికి రూ.32,500 అందజేస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండలంలోని కల్లూరు ఆర్డీటీ ఫీల్డు కార్యాలయంలో గురువారం స్పందించు, సహాయం అందించు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీటీ ఇండియా ఫర్ ఇండియా ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీనివాసులు, ఏటీఎల్ సావిత్రి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ జగ్గాల రవి స్నేహితులు, వ్యాపారులు, ఆటో యూనియన్, ఆర్డీటీ సిబ్బంది కలసి ఆర్డీటీకి రూ.32,500 విరాళం అందించారు. కార్యక్రమంలో ఆర్డీటీ సూపర్‌వైజర్ అనిత, పోతన్న, లక్ష్మీకాంత, వలంటీర్ లీలావతి తదితరులు పాల్గొన్నారు.

డిష్ కేబుల్ తొలగింపు



కేబుల్ కట్ చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

పెద్దపప్పూరు: మండల వ్యాప్తంగా విద్యుత్ స్తంభాల నడుమ ఏర్పాటు చేసిన డిష్ వైర్లు వేలాడుతూ ఉంటే తక్షణమే కట్ చేయాలని సిబ్బందిని ట్రాన్స్ ఏఈ నరసింహులు ఆదేశించారు. బుధవారం డిష్ వైర్లు తగిలి చాగల్లు గ్రామానికి చెందిన వెంకటరమణ గాయపడిన విషయం విదితమే. ట్రాన్స్ ఏఈ ఆదేశాల మేరకు సిబ్బంది చాగల్లు గ్రామ సమీపంలో ట్రాన్స్‌కో సిబ్బంది వేలాడుతున్న టీవీ కేబుల్ వైర్లను కట్ చేశారు. దీంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

యాడికి: రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొనడంతో ఓ వ్యక్తి గాయపడిన సంఘటన మండల కేంద్రంలోని బుగ్గ రోడ్డులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల మేరకు.. బుగ్గ రోడ్డులో నివాసం ఉంటున్న మదన్‌మోహన్ రాత్రి 7గంటల సమయంలో అంగడి వద్ద సరుకులు తీసుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి బయలుదేరగా మరో ద్విచక్ర వాహనం ఢీ కొంది. ఘటనలో మదన్ తలకు, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. యాడికి ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అతడిని 108 ద్వారా తాడిపత్రికి తరలించారు.

చెత్తా చెదారంతో ఇబ్బందులు



కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న బీజేపీ నాయకులు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని చేపల మార్కెట్ వద్ద పేరుకుపోయిన చెత్తా చెదారంతో దుర్వాసన వెదజల్లుతోందని గురువారం కమిషనర్ శివరామక్రిష్ణ దృష్టికి బీజేపీ నాయకులు తీసుకువచ్చారు. పలు ప్రాంతాల్లో చెత్త చెదారాన్ని ట్రాక్టర్ల ద్వారా తరలించకపోవడంతో పందులు చిందరవందరగా చేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలు కాలనీల్లో వీధిలైట్లు వెలగడం లేదని, కొళాయిల్లోకి మురికినీరు రావడంతో దుర్వాసన వస్తోందని కమిషనర్‌కు వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ రంగనాథరెడ్డి, నాయకులు ఆంజనేయులు, రంగనాయకులు, ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.